క్లుప్తంగా

రెండు నెలల్లో రెండు అవార్డులు



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకుంటున్న ఎస్సై కోటయ్య

పొదిలి: స్థానిక పోలీస్ స్టేషన్ అధికారి జి.కోటయ్య రెండు నెలల వ్యవధిలో రెండు అవార్డులు అందుకుని గుర్తింపు తెచ్చుకున్నారు. ఎన్నికలు, కౌంటింగ్ సమయంలో శాంతిభద్రలను అదుపులో ఉంచడంతో పాటు పొదిలి ప్రాంతంలో సంచలనం కలిగించిన నరేంద్ర హత్యకేసును వారం రోజుల్లో ఛేదించారు. ఈ రెండింటికి గాను ఎస్పీ దామోదర్ శనివారం ఆయనకు ప్రశంస పత్రం అందించారు.

ఎప్పుడు ఏం జరుగుతుందో!



చినారికట్ల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న బోరు

కొనకనమిట్ల: గతంలో ప్రమాదవశాత్తు బోరు బావి గుంతల్లో చిన్నారులు పడి మృతి చెందిన సంఘటనలు ఎన్నో జరిగాయి. బోర్లు వేసిన తరువాత నీరు పడని సందర్భాల్లో ఆ పైపులకు మూతలు ఏర్పాటు చేకుండా నిర్లక్ష్యంగా వదిలేయటంతో చిన్నారులు వాటిలో పడి మరణిస్తున్నారు. అలాగే మండలంలోని చినారికట్ల నుంచి పెదారికట్ల వెళ్లే రహదారి పక్కనున్న పొలంలో రైతులు ఇలా బోర్లు వేసి పూడ్చకుండా వదిలేశారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ

కొనకనమిట్ల: జాతీయ రాహదారి కొనకనమిట్ల సమీపంలో శనివారం సాయంత్రం ఎస్ఐ మాధవరావు తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా నడిపే వాహనాలకు చలానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో ప్రజలతో మాట్లాడారు. శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కొత్త చట్టాలు, న్యాయపరమైన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సమన్వయం పాటించి ప్రశాంత వాతావరణం కల్పించాలన్నారు.

రాజ్యాంగ నిర్మాత విగ్రహంపై దాడి శోచనీయం



మురారి వెంకటేశ్వర్లు

తర్లుపాడు: విజయవాడ నడిబొడ్డున భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కూల్చేందుకు ప్రయతి ్నంచడం శోచనీయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి తర్లుపాడు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మాట్లాడుతూ రాజ్యాంగ యోధుడిగా ఆయన దేశానికి చేసిన సేవలు మర్చిపోలేమని, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ. 404.35 కోట్లతో విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసి ఈ ఏడాది జనవరి 19న జాతికి అంకితం చేశారన్నారు. కానీ మహనీయుల విగ్రహాలపై అల్లరిమూకలు దాడులు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యులంతా ఖండించాలని కోరారు.

క్రీడా స్ఫూర్తి చాటాలి



పోటీలు ప్రారంభిస్తున్న మేజిస్ట్రేట్ బాలాజీ, షంషేర్ అలీబేగ్, కాశయ్య

మార్కాపురం: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి చాటాలని మార్కాపురం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ యం. బాలాజీ అన్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని మార్కాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, న్యాయవాద గుమస్తాలకు క్రికెట్ పోటీలను కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీ బేగ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూపని కాశయ్యతో కలిసి ప్రారంభించారు. అసోసియేషన్ కార్యదర్శి అనీల్‌కుమార్, సీనియర్, జూనియర్ న్యాయ వాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రహదారుణాలు



పొతంపల్లి గ్రామానికి వెళ్లే తారు రోడ్డు



రేగుమానిపల్లె గ్రామానికి వెళ్లే తారురోడ్డు

- ప్రయాణించాలంటే నరకమే
- ప్రమాదపుటంచులో వాహన చోదకులు

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల గ్రామం అడ్డరోడ్డు నుంచి గంగుపల్లి గ్రామానికి వెళ్లే తారు రోడ్డు గుంతలు ఏర్పడటంతో రాకపోకలు సాగించాలంటే వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రేగుమానిపల్లె గ్రామం నుంచి పోతంపల్లి గ్రామం మీదుగా హనుమాన్ జంక్షన్ కుంట వరకు నిత్యం ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ప్రయాణం కొనసాగిస్తుంటారు. వర్షాలు కురిసినప్పుడు గుంతల్లో నీరు చేరడం వలన రాత్రిపూట అవి కనిపించడంలేదు. ఫలితంగా గుంతల్లో ద్విచక్ర వాహనం టైర్లు పడటంతో కిందపడి గాయాలైయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని వాహనదారులు వాపోతున్నారు. గర్భిణీలు, బాలింతలు వైద్యశాలకు ఆటోలో ప్రయాణించాలంటే ప్రాణం అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని మహిళలు ఆందోళన చెందుతున్నారు. మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని.. వర్షం కురిసినప్పుడు రోడ్డుపై నీరు నిల్వ ఉండి తారు లేచి పోయి కంకర రాళ్ళు బయటపడి గుంతలు ఏర్పడుతున్నాయి. ప్రతి కిలోమీటర్, అర కిలోమీటర్‌కు గుంతలు ఉండటంతో ఆటోల్లో కూర్చోని ప్రయాణిస్తున్న ప్రజలు ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. రేగుమానిపల్లె, పోతంపల్లె గ్రామాల ప్రజలు నిత్యం హనుమాన్ జంక్షన్ కుంట, పెద్దదోర్నాల, మండల కేంద్రం పెద్దారవీడుకు రాకపోకలు సాగిస్తుంటారు. పలుమార్లు తారురోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతుల చేయాలని మండల స్థాయి అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు



గంగుపల్లి గ్రామాల మధ్య ఇలా..

ఆగ్రహం చెందుతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి గుంతలను పూడ్చి, వాహదారులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషం



వై.పాలెంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు



అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

- నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

యర్రగొండపాలెం: విజయవాడలో సామాజిక న్యాయ మహాశిల్పమైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై టీడీపీ పచ్చమూకలు దాడిచేయడాన్ని నిరసిస్తూ శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, దళిత సంఘ నాయకుడు చేదూరి విజయభాస్కర్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును తొలగించడం హేయమైన చర్య అన్నారు. భావితరాలకు స్ఫూర్తిగా, దిక్సూచిగా నిలవాలన్న ఉద్దేశంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విజయవాడలోని నడిబొడ్డున అంబేడ్కర్ స్మృతి వనాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. అప్పట్లో అన్నివర్గాలు హర్షించారన గుర్తు చేశారు. అమరావతిలో అంబేడ్కర్ స్మృతి వనాన్ని నిర్మిస్తానని గతంలో సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రగల్భాలు పలికి విస్మరించారని, మరో సారి అధికారంలోకి వచ్చిన ఆయన.. జగనన్న నిర్మించిన అంబేడ్కర్ స్మృతివనంపై దాడి చేశారని విమర్శించారు. ముందుగా బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పూలమాలవేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్ ఆర్. అరుణాబాయి, దళిత సంఘాల నాయకులు బొమ్మాజి బాలచెన్నయ్య, జయరావు, టి.రాంబాబు, పాస్టర్ల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సన్నెపోగు సుందరరాజు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, వివిధ విభాగాల నాయకులు ఏకుల మునలారెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, ఒంగోలు సుబ్బారెడ్డి, షేక్ వలి పాల్గొన్నారు.

ముమ్మరంగా పొగ నాట్లు



పొగ నారు వేస్తున్న కూలీలు

దొనకొండ: మండలంలో పలు గ్రామాల్లో రైతులు పొగ నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. నాలుగు రోజుల నుంచి చిరు జల్లులు కురవడంతో రైతులు పొగ నాట్లపై దృష్టి సారించారు. ఇతర ప్రాంతాలకు వెళ్ళి పొగ నారు కొనుగోలు చేసి పొలాల్లో నాటుతున్నారు. గత ఏడాది పొగాకు ఉత్పత్తి, నాణ్యమైన గిట్టుబాటు ధర లభించింది. దీంతో ఈ ఏడాది రైతన్నలు పొగాకుపై కన్ను వేశారు. గ్రామాల్లో రైతులు పోటీలు పడి ఎకరాలు, ఎకరాలు సాగు చేస్తున్నారు. ఓ పక్క పొగాకు బోర్డు వారు ఈ ఏడాది పొలం విస్తీర్ణం తగ్గించుకుని పొగ నారు నాటమంటున్నారు. గిట్టుబాటు ధర ఉండక పోవచ్చని పొగాకు బోర్డు వారి అంచనా. విస్తీర్ణం తగ్గించుకోకుంటే నష్టపోతున్నారని చెప్తున్నారు. రైతన్నలు మాత్రం వారి మాట లెక్క చేయకుండా పండించిన పంటకు ధర ఎందుకు ఉండదని పోటీతత్వంతో సాగు చేస్తున్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న కారు

-ముగ్గురికి గాయాలు



గాయపడిన పులుకూరి ఎలియాజర్ పాల్

పెద్దదోర్నాల: ముందుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుకగా వస్తున్న కారు ఢీ కొనడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని కటకానిపల్లె సమీపంలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎంఈఓ కార్యాలయంలో సీఆర్ఎంటీగా విధులు నిర్వహిస్తున్న పులుకూరి ఎలియాజర్ పాల్‌తో పాటు అతని సతీమణి, కుమారుడికి గాయాలయ్యాయి. చింతల అగ్రహారం నుంచి ద్విచక్రవాహనంపై మార్కాపురానికి కుటుంబంతో వెళ్తున్న వీరిని వెనుకగా వస్తున్న కారు ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రులను స్థానికులు మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మృతులకు నివాళి



మంగమూరి పోలయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం రూరల్: మండలం చింతకుంట్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పోలమ్మ గారి భర్త పోలయ్య గారు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మార్కాపురం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పోలయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బోడిచెర్ల గ్రామంలో..

తర్లుపాడు మండలం బోడిచెర్ల గ్రామానికి చెందిన తానుగుండాల అల్లూరిరెడ్డి (66) అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అల్లూరి రెడ్డి మృత దేహానికి నివాళులర్పించారు.

తిరుమలనాథునికి ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండల పరిధిలో రాజంపల్లి గ్రామ సమీపంలో వెలసిన శ్రీ గొ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు శనివారం చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి, రాజ్యలక్ష్మీ అమ్మవారికి అభిషేకాలు, అర్చన, కుంకుమార్చన పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలదండతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయం ప్రాంగణంలో జీర్ణోద్ధరణ కమిటీ సభ్యులు భక్తుల కోసం మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు.



తిరుమలనాథస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



జగన్‌ను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే

జగన్‌ను పరామర్శించిన బూచేపల్లి

దర్శి: అనారోగ్యంతో ఇటీవల ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చిన వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి చెరుకూరి జగన్‌మోహన్‌రావును ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆర్య వైశ్య సంఘ నాయకులు గుప్తా అనారోగ్య కారణంగా ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి రాగా వారిని కలిసి మాట్లాడారు.



గుప్తాను పరామర్శిస్తున బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి



వర్షం లేకపోవడంతో బీళ్లుగా ఉన్న పొలం

చినుకు రాలదు.. చింత తీరదు

- కొమరోలు మండలంలో కరువు ఛాయలు
- వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతన్నలు
- ఆగస్టు వచ్చినా బీడుగా ఉన్న పంట పొలాలు

కొమరోలు: మండలంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతన్నలు వర్షాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జూన్ నెలలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగా విస్తారంగా వర్షాలు పడకపోవడంతో రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎలాంటి పంట సాగు చేయకపోవడంతో పంట పొలాలు బీళ్లుగా మారాయి. జూన్ నెలలో పడిన తొలకరులకు కొంతమంది పంటలు సాగు చేసినా ఆపై వరుణుడు కరుణించకపోవడంతో ఆ పంటలు వాడిపోయాయి. రైతన్నలు తమ పశువులను బీడు భూముల్లో మేతకు పంపిస్తున్నారు. ఎలాంటి పనులు లేక కర్షకులు ఖాళీగా కూర్చుంటున్నారు.

ఈ ఏడాది పంట సాగు విస్తీర్ణం ఇలా...

ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సంవృద్ధిగా వచ్చినట్లయితే పంట పొలాలు ఇప్పటికే సాగులో ఉండి పచ్చదనంతో కళకళలాడేవి. మండలంలో 4872 హెక్టార్లకు గాను 2123 హెక్టార్లలో మాత్రమే పంట సాగైంది. కంది 1417 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా, కేవలం 297 హెక్టార్లలో మాత్రమే సాగయింది. వరి 379 హెక్టార్లకు గాను 23 హెక్టార్లలో, నువ్వుపంట 534 హెక్టార్లకు గాను 99 హెక్టార్లలో, పత్తి 589 హెక్టార్లకు గాను 16 హెక్టార్లలో, పెసర 125 హెక్టార్లకు గాను 18 హెక్టార్లలో, మిరప 123 హెక్టార్లకు గాను 25 హెక్టార్లలో మాత్రమే సాగైంది. తొలకరుల సమయంలో సాగు చేసిన పంటలకు కూడా ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో పంటలు వాడుముఖం పట్టాయి. బోరు కింద ఉన్న పొలాలు మాత్రమే సాగులో ఉన్నాయి. వర్షాలు లేకపోవడంతో తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



బీడు భూమిలో పశువులను మేపుతున్న దృశ్యం

పొలాలన్నీ బీళ్లుగా మారుతున్నాయి



మూడు నెలలుగా వర్షాలు కురవక పోవడంతో పొలాలన్నీ బీళ్లుగా మారుతున్నాయి. మేము వర్షాధార పంటలపైన ఆధారపడి జీవించే రైతులం. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో మా పరిస్థితి దయనీయంగా ఉంది. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– మద్దులేటి, రైతు

వర్షాలు లేక సేద్యం చేయలేదు



గత మూడేళ్లుగా సంవృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో ఈ ఏడాది కూడా వర్షాలు కురుస్తాయనే ఉద్దేశంతో 10 ఎకరాల పంట పొలాన్ని కౌలుకు తీసుకున్నాం. కానీ వర్షాలు కురవకపోవడంతో ఆ పొలంలో ఎలాంటి పంట సేద్యం చేయలేదు. కౌలు రూ.1.30 లక్షలు రైతు యజమానికి ఖచ్చితంగా కట్టాలి. ఇక వర్షాలు పడతాయనే నమ్మకం లేదు.

– లక్ష్మీదేవి, రైతు

ముగిసిన అపార్డ్ శిక్షణ

దొనకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ అపార్డ్ ట్రైనింగ్ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ వి. వసంతరావు నాయక్ మాట్లాడుతూ పంచాయతీ పరిపాలన గురించి సూచన, సలహాలందించారు. గ్రామాల్లో చక్కటి పరిపాలన అందించాలని గ్రామ ప్రథమ పౌరుడు సర్పంచ్ అని గుర్తు చేశారు. సర్పంచ్ పదవి విలువలతో కూడినదని, గ్రామంలో ప్రతి ఒక్కరికీ వీలైనంత వరకు న్యాయం చేయాలని తెలిపారు. పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా పంచాయతీకి చాలా ముఖ్యమైనవని ఎంపీడీఓ తెలిపారు. ఈఓఆర్డీ వైవీడి ప్రసాద్, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ